సాక్షి చిత్తూరు
ఆదివారం । 30 । జూలై । 2023



రేషన్ గద్దలపై నిఘా!
ప్రజాపంపిణీ పక్కాగా నిర్వహించడంలో భాగంగా అధికారులు. రేషన్ దందాపై ఉక్కుపాదం మోపేందుకు సన్నద్ధమవుతున్నారు. - 8లో



వరసిద్ధుని సేవలో న్యాయమూర్తులు
కాణిపాకం వినాయకస్వామిని శనివారం ఏపీ, కర్ణాటక న్యాయమూర్తులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	26
తిరుపతి	34	26
తిరుమల	30	22
గూడూరు	36	28
నగరి	36	27

న్యూస్‌రీల్

కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. వేకువ నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాడంతో కంపార్ట్‌మెంట్‌లు, క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాట్లు చేశారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తూ వీఐపీ దర్శనాలను కుదించారు.

జాతీయ బాలల పురస్కారానికి దరఖాస్తులు



ఐసీడీఎస్ పీడీ నాగశైలజ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులైన బాల, బాలికలు జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలు–2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వివిధ రంగాలలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన 18 ఏళ్లలోపు బాల,బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. ఆసక్తిగల వారు www.awards.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌కో రాబడి రూ.1.61 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్లలో శనివారం విద్యుత్ బిల్లుల చెల్లింపుల ద్వారా ట్రాన్స్‌కోకు రూ.1.61 కోట్లు వచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. సెలవురోజు అయినప్పటికి విద్యుత్ బిల్లు చెల్లించే అవకాశం కల్పించామన్నారు. అందులో భాగంగా మొత్తం 15,780 సర్వీసులకు సంబంధించి వినియోగదారులు బిల్లులు చెల్లించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో చిత్తూరు అర్బన్- రూ.23 లక్షలు, చిత్తూరు రూరల్- రూ.4.98 లక్షలు, మదనపల్లె- రూ.14.80 లక్షలు, పీలేరు- రూ.12.05 లక్షలు, పుంగనూరు- రూ.12.35 లక్షలు, పుత్తూరు- రూ.16.17, తిరుపతి రూరల్- రూ.20 లక్షలు, తిరుపతి అర్బన్- రూ.58.64 కలెక్షన్ వచ్చినట్లు వివరించారు.

పక్కాగా సరుకుల తూకం



సరుకులు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

బంగారుపాళెం: గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు పంపిణీ చేసే సరుకుల తూకం పక్కాగా ఉండాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం బంగారుపాళెం లోని గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అవినీతికి కేరాఫ్ బాబు

- 108, ఆరోగ్యశ్రీ అంటే రాజన్న
- అమ్మఒడి, ఆసరా అంటే సీఎం వైఎస్ జగన్
- ప్రాజెక్టు గురించి చంద్రబాబుకు తెలిసింది శూన్యం
- ఆయన నిర్వాకంతోనే పోలవరం నిర్మాణంలో జాప్యం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పనులు వేగవంతం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు వార్డుబాటలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు : రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్ అంటే చంద్రబాబు నాయుడని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం పుంగనూరులో నిర్వహించిన వార్డు బాట అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రాజెక్టులపై ఏమాత్రం అవగాహన లేదని, కాసులకు కక్కుర్తి పడి పోలవరం ప్రాజెక్టును జాప్యం చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రాజెక్టును డబ్బుల కోసమే రూ.15వేల కోట్లతో చేస్తామని నెత్తికెత్తుకున్నారని మండిపడ్డారు. కేవలం ఆదాయం వచ్చే పనులను మాత్రమే పోలవరం ప్రాజెక్టులో చేసి చేతులెత్తేశారని విమర్శించారు. కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయేందుకు చంద్రబాబు నిర్వాకమే కారణమన్నారు. పోలవరం సందర్శన పేరుతో రూ.100 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన ఘనుడని ఎద్దేవా చేశారు. జాతీయ ప్రాజెక్టును అర్ధరాత్రి ప్యాకేజీలకు ఒప్పుకుని తాకట్టు పెట్టి స్వీట్లు పంచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాలువలు తవ్విస్తే అసెంబ్లీలో నానా యాగీ చేసిన చంద్రబాబు, మళ్లీ అదే కాలువలతో పట్టిసీమ ప్రాజెక్టు పేరిట వాడుకున్నారని వివరించారు. రాజన్న హయాంలోనే హంద్రీ-నీవా 95శాతం పూర్తయ్యిందని, చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో సొంత నియోజకవర్గం కుప్పానికి కూడా నీరు అందించలేదని వెల్లడించారు. మూడుసార్లు తూతూమంత్రంగా శంకుస్థాపన చేసి ప్రజలను మోసం చేశారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కుప్పానికి నీరు అందించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం ధరల్లో పోలవరం నిర్మాణానికి రూ.55వేల కోట్లకు పైగా ఖర్చువుతుందని వివరించారు. బాబు నిర్వాకం వల్ల కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయకపోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి చర్చలు జరిపారన్నారు. అందులో భాగంగానే అనుమతులు సాధించి పనులు వేగవంతం చేశారని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఆరోగ్యశ్రీ, 108ను ప్రవేశపెట్టి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారు. అమ్మ ఒడి, ఆసరా తదితర పథకాలతో సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టిస్తున్నారని స్పష్టం చేశారు. అదే చంద్రబాబు పేరు గుర్తుండేలా ఈ 14 ఏళ్లలో ఒక్క పథకమైనా ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. గతంలో మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు విశాఖకు వెళ్లి రాత్రి వెళ్లి పనులు కొలతలు వేసి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. బాబు అండ్ కో మాటలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పిస్తారని వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత టీడీపీ నామరూపాలు లేకుండా పోవడం తథ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా రేషన్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో కట్టుదిట్టంగా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామన్నారు. పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 336 ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 373.135 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనల మేరకు సీజ్ చేసిన బియ్యాన్ని ఆగస్టు 8వ తేదీన ఓపెన్ టెండర్ వేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొత్తం 2.5లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు.

యూత్ ఐకాన్ సీఎం జగన్





బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి ఆర్‌కే రోజా, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- జగనన్న పాలనలో క్రీడలకు ప్రాధాన్యం
- ఆడుదాం ఆంధ్రతో రాష్ట్రంలో క్రీడా విప్లవం
- మంత్రి ఆర్‌కే రోజా

తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించి యూత్‌కు ఐకాన్‌గా నిలిచారని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శనివారం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదిగా జరుగుతున్న ఏపీ స్టేట్ జూనియర్ బ్యాడ్మింటన్ అండర్–19 చాంపియన్‌షిప్ పోటీలను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జగనన్న పాలన క్రీడలకు స్వర్ణయుగమని కొనియాడారు. గత ఏడాది డిసెంబర్‌లో క్రీడా సంబరాలు, సీఎం కప్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్టు గుర్తుచేశారు. త్వరలో రాష్ట్ర పండుగలా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా విప్లవం రాబోతోందని, యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు సరైన వేదికగా ఇది నిలవనుందని తెలిపారు. సుమారు 15,004 సచివాలయాల నుంచి 2 లక్షల 99వేల మంది క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. తిరుపతి మేయర్ శిరీష, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారకనాథ్, చిత్తూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.ఆనందరెడ్డి, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు క్వార్టర్ ఫైనల్స్

చాంపియన్ షిప్‌లో భాగంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఆదివారం జరగనున్నాయి.

'మట్టి వాసన' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు

చిత్తూరు రూరల్: నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో రఘురాం రామస్వామి రచించిన మట్టివాసన కథల సంపుటిని శనివారం ఆవిష్కరించారు. చిత్తూరు బౌద్ధ ధర్మ సంఘం అధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు కవులు, రచయితలు, భాషాభిమానులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రచనలు భాషాభివృద్ధితోపాటు సమాజానికి మేలు కొలుపుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు రామలక్ష్మి, సహదేవనాయుడు, పెరియార్‌స్వామి, మురళి, బాలరాజు, రాజరత్నంరెడ్డి, రమేష్ బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

అమ్మో ట'మోత'!

- పలమనేరులో బాక్సు రూ.2,220
- మార్కెట్ చరిత్రలో ఇదే అత్యధిక ధర



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు : పలమనేరు మార్కెట్‌లో శనివారం 15 కిలోల టమాటా బాక్సు ధర రూ.2,220 పలికింది. ఇక్కడ మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అత్యధిక ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం టమాటా సాగు చేసిన రైతులకు అదృష్టం పట్టుకుంది. పలువురు రైతులు రూ.లక్షల నుంచి రూ.కోట్ల ఆదాయం పొందడం విశేషం.

స్కార్పియో కారు దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గంగవరం : పలమనేరు– బెంగళూరు జాతీయ రహదారిపై పొన్నమాకులపల్లె వద్ద శనివారం ఓ స్కార్పియో కారు దగ్ధమైంది. వివరాలు.. బెంగళూరుకు చెందిన హేమంత్‌కుమార్, భార్య సౌందర్యతో కలిసి కారులో రెండు రోజులు క్రితం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఉండగా కారులో నుంచి పొగలు రావడాన్ని హేమంత్ కుమార్ గమనించి వెంటనే పక్కన ఆపేసి భార్యతో కలిసి దిగేశారు. ఇంతలో కారులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారులో మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ గద్దలపై నిఘా!

జిల్లాలో రేషన్ దందాను అక్రమార్కులు యథేచ్ఛగా సాగిస్తున్నారు. వేలాది టన్నులను జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు. సన్నబియ్యంగా మార్చి మళ్లీ మార్కెట్‌లో విక్రయించేస్తున్నారు. ఇదే తరహాలో కందిపప్పు, చక్కెరను సైతం పక్కదారి పట్టించేస్తున్నారు. నిత్యం చౌక సరుకుల అక్రమ రవాణాపై ఫిర్యాదు వెల్లువెత్తుతుండడంతో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజాపంపిణీపై కట్టుదిట్టంగా నిఘా పెటేందుకు ప్రణాళిక రూపొందించారు. రేషన్ గద్దలపై ఉక్కుపాదం మోపేందుకు సన్నద్ధమవుతున్నారు.

- జోరుగా చౌక బియ్యం అక్రమ రవాణా
- సరిహద్దులు దాటుతున్న వేలాది టన్నులు
- ప్రజా పంపిణీపై కట్టుదిట్టంగా జాగ్రత్తలు

చిత్తూరు రూరల్: జిల్లాలో 1379 చౌక దుకాణాలు ఉన్నాయి. 336 రేషన్ పంపిణీ వాహనాలు సేవలందిస్తున్నాయి. మొత్తం 5,31,501 కార్డుదారులకు ప్రభుత్వం రేషన్ సరుకులు పంపిణీ చేస్తోంది. ప్రతినెలా 15వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 5 వేల టన్నుల కందిపప్పు, 3వేల టన్నుల చక్కెర, 10వేల టన్నుల రాగులను సరఫరా చేస్తోంది. గతంలో ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం తూకంలో తేడాలొచ్చేవి. ఈకిరికిరికి ఇటీవలే ప్రభుత్వం చెక్ పెట్టింది. సరుకులను డీలర్లే తూకం వేయించి షాపుకు తీసుకెళ్లాలని, ఆర్ఓను తప్పనిసరి చేసింది. దీంతో తూకంలో మోసాలకు అడ్డుకట్ట పడింది. అయితే క్షేత్రస్థాయిలో రేషన్ దందాకు మాత్రం అడ్డుఅదుపులేదని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.

దోపిడీ ఇలా..

జిల్లాలో కొందరు వ్యక్తులు రేషన్ సరుకుల అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. వీరికి పలువురు డీలర్లు సహకరిస్తున్నారు. అలాగే కార్డుదారుల నుంచి సైతం అక్రమార్కులు బియ్యం కొనుగోలు చేసుకుంటున్నారు. దళారుల సాయంతో ఇంటింటా సేకరించి వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని కర్ణాటక, తమిళనాడులో విక్రయించుకుంటున్నారు. ప్రతినెల సుమారు 5వేల టన్నుల వరకు అక్రమంగా తరలుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టి కొంత మేరకు పట్టుకుంటున్నారు. కొందరు రేషన్ బియ్యాన్ని సన్నగా మార్చి బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి అమ్మకానికి పెడుతున్నారు. బ్యాగును రూ.1,200లకు అంటగడుతున్నారు. డీలర్లు కొంత మంది కందిపప్పు, చక్కెరను కూడా కార్డుదారులకు తెలియకుండా తూకం వేసి చౌకగా అంగట్లో అమ్ముకుంటున్నారు.



అంగట్లో కందిపప్పు, చక్కెర విక్రయించి ఖాళీ ప్యాకెట్లను రోడ్డుపైన పడేసిన దృశ్యం (చిత్తూరు నగరంలో)

అక్రమాలకు పాల్పడితే వేటే



ప్రజాపంపిణీలో అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముకుంటున్నారని తెలిస్తే కఠిన చర్యలు తప్పవు. సమాచారం అందించిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచి అక్రమార్కుల ఆట కట్టిస్తాం. రేషన్ పంపిణీలో తప్పులు కనిపిస్తే కార్డుదారులు ప్రశ్నించవచ్చు. – శంకరన్, డీఎస్ఓ, చిత్తూరు

అడ్డుకునేందుకు చర్యలు

రేషన్ బియ్యం, ఇతర సరుకుల అక్రమ వ్యాపారానికి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. 1967 టోల్ ఫ్రీ నంబరును తీసుకొచ్చింది. అప్పటి నుంచి ఫిర్యాదులు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ఇక జేసీ, డీఎస్ఓలకు సైతం తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆగస్టు నుంచి రేషన్ పంపిణీపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు ప్రత్యేక బృందాన్ని నియమించాలని సూచించింది. అక్రమార్కులను కటకటాల వెనక్కు నెట్టేయాలని స్పష్టం చేసింది.

వరసిద్ధుని సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ జ్యోతిర్మయికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి సేవించుకున్నారు. శనివారం రాత్రి కుటుంబ సమేతంగా విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ ఈఓ వెంకటేశు ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వరసిద్ధుని తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక ఉప లోకయుక్త న్యాయమూర్తి జస్టిస్ ఫణీంద్ర సేవించుకున్నారు. మధ్యాహ్నం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.